

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**మంగల భవన్ అమంగల హారీ! ద్రవ ఉ దసరథ అజిర బిహారీ**

**రామ్! సియా రామ్!సియా రామ్! జైజై రామ్!**

**హిందీ** సినిమాలలో సాంప్రదాయక భక్తిగీతాలను అత్యద్భుతంగా ఉపయోగించుకున్నారు. వారికి అపారమైన భజనల ఖజానా ఉంది. తులసీదాసు, సురదాసు, జ్ఞానదేవుడు, తుకారాం , మీరా, జయదేవుడు, చైతన్య మహాప్రభు, వైష్ణవ భజనగీతాలు, గో సాయి, గోస్వామి గీతాలు, శివ భక్తి గీతాలు, రామలీల, సూఫీ గీతాలు, ఇలా అపారమైన భక్తి గీతాలున్నాయి. సినీ కళాకారులు వాటిని సినిమాల్లో అతి చక్కగా వాడుకున్నారు. ఇప్పుడు చాలా మటుకు తగ్గిపోయింది కానీ 1950 నుండి 1975 వరకూ, హిందీ సినీ సంగీతంలో 'స్వర్ణయుగం'లా భావించిన కాలంలో ఇలాంటి భక్తిగీతాల వాడకం అత్యంత సృజనాత్మకంగా సాగింది. 1960 దశకం చివరి వరకు భారత, రామాయణ గాథల అధారంగా సినిమాలు వచ్చాయి. 1970 తరువాత ఇలాంటి సినిమాలు తగ్గిపోయాయి. 1975లో వచ్చిన 'గీత్ గాతా చల్ ' 'రామ చరిత్ మానస్'లోని చౌపాయీలను అత్యంత సృజనాత్మకంగా వాడుకున్న సినిమా. ఇందులో 'సచిన్' పాత్ర దేశద్రిమ్మరిలాంటివాడు. అలా తిరుగుతూ ఓ గ్రామానికి వస్తాడు. వాళ్లింట్లో ఆశ్రమం పొందుతాడు. తెల్లారి అందరికన్నా ముందులేచి గుడిలో రామచరిత మానస గానంతో అందరినీ నిద్రలేపుతాడు. మార్కులు కొట్టేస్తాడు. నిజానికి ఇలాంటి దృశ్యాలు మన సినిమాల్లో కోకొల్లలు. నాయిక నాయకుడి ఇంటికి వస్తుంది. నాయకుడి తల్లి నిద్రలేచేసరికి, నాయిక స్నానం చేసి, పూజ గదిలో కూర్చుని భక్తిగీతం ఆలపిస్తుంది. అందరికీ ప్రీతి పాత్రురాలవుతుంది. అలాంటిదే ఈ దృశ్యం. తేడా నాయిక బదులు నాయకుడు ఇక్కడ పాట పాడతాడు.రవీంద్ర జైన్ ఒక విలక్షణమైన సంగీత దర్శకుడు. ఆయన పాటలు చాలా సులభమైన బాణీలతో, ఆకర్షణీయంగా ఉంటాయి. అధికంగా తక్కువ బడ్జెట్ సినిమాలకు పనిచేయటం వల్ల కాబోలు, అతని పాటలలో ఆర్కెస్ట్రా కూడా చాలా మృదువుగా ఉంటుంది. ఆయన గుడ్డివాడయినా, తన పాటలలో అధికశాతం గేయ రచయితకూడా ఆయనే. చక్కని హిందీ భాష అతనిది. మృదువైన పదాలతో లోతైన భావాన్ని, ఇంపైన ప్రతీకలతో, ఉపమానాలతో పాటను రచిస్తాడు రవీంద్రజైన్.

సంగీత దర్శకుడే గేయ రచయిత అయితే ఉండే సౌలభ్యం రవీద్రజైన్ రాసి, సంగీత దర్శకత్వం వహించిన పాటలను పరిశీలిస్తే అర్థమవుతుంది. పదాలు, బాణీ , పాలూ నీరులా కలిసిపోయి ప్రవహిస్తాయి. ముఖ్యంగా శుద్ధ హిందీ

సరళమైన పదాలు పాట బాణీతో ఎలా కలిసిపోతాయంటే తేనె తీయగా నోట్లో కరుగుతున్నట్టు ఉంటుంది రవీంద్ర జైన్ పాటలు వింటూంటే. జానపద గీతాలు, ముఖ్యంగా, ప్రాంతీయ వాడుక భాష పదాల వాడకంపై కూడా పట్టు ఉండటంతో రాజశ్రీ సంస్థ నిర్మించే పల్లెటూరి సినిమాలన్నిటికీ రవీంద్రజైన్ సంగీత దర్శకుడిగా ఉండేవాడు. మట్టి గుబాళింపుతో పాటలను ఘుమ ఘుమలాడించేవాడు. రామచరిత మానస్ రవీంద్రజైన్‌కు కంఠత వచ్చు. ఆయనకు అత్యంత ఇష్టమైన కావ్యం అది. అందుకే టీవీలో 'రామాయణ్'కు సంగీత దర్శకుడేకాదు అవసరమైనప్పుడు నేపథ్యంలో గానం కూడా చేశాడు రవీంద్ర జైన్. దీనంతటికి ఆరంభం 'గీత్ గాతా చల్' సినిమాలోని 'మంగల్ బవన్ అమంగల్ హారీ' పాట.'మంగల్ బవన్' పాట గేయ రచయితగా రవీంద్రజైన్ పేరుంటుంది. కానీ ఇవన్నీ 'రామచరిత మానస్'లో వివిధ సందర్భాలలో వచ్చే 'చౌపాయీ'ల పాదాలను కలిపి ఒక గీతంగా కూర్చాదు రవీంద్రజైన్ . ఆయన స్వయంగా రచించినవి కావు. మంగళం కలిగించేవాడు, అమంగళాన్ని దూరం చేసేవాడు అయిన దశరథ తనయుడు నాపై కృపారసం కురిపించాలి.

పాట ఆరంభంలోనే 'జస్పాల్ సింగ్ ' స్వరం ఆకర్షిస్తుంది. హై పిచ్ అతి సులభంగా పాడేయగలడు 'జస్పాల్ సింగ్. సినీ రంగంలో పలు కారణాల వల్ల ఆయన నిలద్రొక్కుకోలేకపోయాడు. కానీ పాడిన పాటలన్నీ అత్యద్భుతంగా పాడాడు. హిట్ పాటలు పాడాడు. కానీ అతను అధికంగా గ్రామీణ ప్రాంతపు పాటలు, రాజశ్రీ నిర్మాణ సంస్థ సినిమాలకు పాడటంతో అతనిపై ఓ ముద్ర పడిపోయింది. ముఖ్యంగా అతను పాడిన 'జబ్ జబ్ తూ మెరె సామ్నె ఆయే ' పాట అత్యంత మధురమైన రీతిలో పాడాడు జస్పాల్ సింగ్. అతని ఇతర సినిమాల పాటలు ఒక ఎత్తు, 'గీత్ గాతా చల్'లో పాటలు ఒక ఎత్తు. పంట పొలాలమీద నుంచి వీచే ఒక శుభ్రమైన, స్వచ్ఛమైన వాయు వీచికలా ఉంటుంది అతని స్వరం ఈ సినిమా పాటల్లో. అది ఈ సినిమాలోని పాటలకు ఒక అందాన్ని, సొగసును ఆపాదించింది. భక్తి గీతాల్లో పవిత్రతను, నిర్మలత్వాన్ని ధ్వనింపచేసింది.

**హో హో ఇహ వహీ జో రాం రచి రాఖా**

**కో కరే తరఫ్ బఢాయే సాఖా**

భగవంతుడు రాముడు భవిష్యత్తు ఏమని రాశాడో, అదే అవుతుంది. మనం ఎంత తర్కించినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా దాన్ని మార్చలేము.

**హో ధీరజ్ ధరం మిత్ర అరు నారీ**

**ఆపద్ కాల్ పరిఖియే చారీ**

ధైర్యం, మిత్రులు,  ధర్మం వంటి విషయాలలో నిగ్గు తేల్చేది దుర్దశనే.

**జేహికే జేహి   పర్ సత్య సనేహూ**

**సో తోహి మిలయ న కచ్చు సందేహూ**

సత్యాన్ని ఎవరూ దాచి పెట్టలేరు. సూర్యోదయం అయినట్టు సత్యం తప్పక ప్రకటితమవుతుంది.

**జాకీ  రహి భావనా జైసీ**

**రఘు మూరతి  దేఖీ తిన్ తైసీ**

ఎవరు భగవంతుడిని ఏ రూపంలో ధ్యానిస్తారో భగవంతుడు వారికి ఆ రూపంలోనే దర్శనమిస్తాడు.

**రఘుకుల రీత్ సదా చలీ ఆయీ**

**ప్రాణ్ జాయె పర్ వచన్ న జాయీ**

రఘుకుల పరంపరలో ఎల్లప్పుడూ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ఆనవాయితీ ఉంది. ప్రాణాన్నయినా త్యాగం చేస్తారు కానీ ఇచ్చిన మాట తప్పరు.

**హరి అనంత హరి కథా అనంత**

**కహహి సునహి బహు విధి సబ్ సంతా**

హరి అనంతుడు. హరి కథలు అనంతం. పలువురు సాధు, సన్యాసులు హరి వర్ణనను విభిన్నమైన రీతులలో చేశారు.

అతి సరళంగా, సులభంగా అర్ధమయ్యే పాదాలను ఎంచుకుని ఒక పద్దతి ప్రకారం పాటను కూర్చాడు రవీంద్రజైన్. ఒక్కసారి వింటే తనివి తీరదు. ఎన్ని మార్లు వింటే అన్నిమార్లు ఇంకొన్ని మార్లు వినాలనిపిస్తుంది. ఈ పాట వింటూంటే రామచరిత మానస్ చదవాలనిపిస్తుంది. సినిమాలు ఉత్తమ సంస్కారాన్ని ప్రదర్శిస్తే, సమాజానికి ఉత్తమ సంస్కారంవైపు దిశా నిదర్శనం చేసినవవుతాయి.

సినిమాలలో భజనలు, కీర్తనలు, అభంగ్‌లు వంటి సాంప్రదాయక భక్తి తత్వ గీతాలను వాడటం వల్ల వాటికి ప్రచారం లభిస్తుంది. ఉత్తమ భావాలు సమాజంలో విస్తరిస్తాయి. అందుకే ఒకప్పుడు కళాకారులు కొన్ని నియమ నిబంధనలు స్వచ్ఛంగా తమపై విధించుకున్నారు. నటి, నిర్మాత, దర్శకురాలు, రచయిత్రి, గాయని భానుమతి, విధిగా తన సినిమాల్లో ఏదో ఓ సందర్భంలో ఓ శాస్త్రీయ రాగ ఆధారిత పాట, వీలయినంతవరకూ భక్తిగీతం ఉండేట్టు చూసేది. అది తానే పాడేది. ఎస్డీ బర్మన్ పాట పాడాలంటే అది నేపథ్య గీతం అయి ఉండాలి. తాత్విక గీతం అయి ఉండాలి, మామూలు పాటలు అతను పాడేవాడు కాదు హిందీ సినిమాల్లో. ఇలాంటి నిబంధన వల్ల కళాకారులకు ప్రత్యేక గుర్తింపు రావటమే కాదు, వారి పాటలవల్ల ఉత్తమ భావాలు సమాజంలో విస్తరించే వీలు చిక్కేది. అందుకే ఒకప్పుడు సినిమాల్లో మీరా

భజనలు, సురదాసు కీర్తనలు, తుకారాం అభంగ్‌లు, వైష్ణవ భక్తి గీతాలు విరివిగా వినిపించేవి. రాను రాను అవి అదృశ్యమయ్యాయి. 'మంగల్ భవన్'లాంటి పాటలు వింటూంటే అందుకే మనసు బరువెక్కుతుంది. పాట విలువ పదింతలు పెరుగుతుంది.

'గీత్ గాతా చల్' సినిమాలో మరో సందర్భంలో భక్తిగీతం వస్తుంది. అది భక్తిగీతం. కానీ సందర్భం పరిధిలో చూస్తే అది నాయికకు నిజం సున్నితంగా చెప్పే దృశ్యం. నాయిక నాయకుడిని ప్రేమిస్తుంది. కానీ అతడు మరో అమ్మాయిని ప్రేమిస్తున్నాడని అనుమానిస్తుంది. అసూయ ప్రదర్శిస్తుంది. అనవసరమైన వివాదాన్ని రేకెత్తిస్తుంది. దాంతో ముగ్గురి నడుమ వాతావరణం విషపూరితమవుతుంది. ఎంతగా నిజాన్ని వివరించాలని ప్రయత్నించినా నాయిక ఆ అవకాశాన్నివ్వదు. దాంతో 'పాట' పద్ధతిని ఎంచుకుంటూంది ఆ అమ్మాయి. తన మనసులో మాటను చెప్పి, నిజానిజాలు వివరించి, అనుమాన మేఘాలను తొలగించి, సత్యం అనే సూర్యుడి వెలుతురు ప్రసరింపచేసేందుకు రాధ, మీరల ఉపమానాలను అత్యంత సృజనాత్మకంగా వాడతాడు గేయ రచయిత రవీంద్ర జైన్ ఈ పాటలో.

**శ్యాం తేరీ బన్సీ పుకారే రాధా నాం**

**లోగ్ కరే మీరా కో యూహీ బద్ నాం.**

ఈ పాట రవీంద్ర జైన్ రూపొందించినది. పాట ఆరంభంలో వినిపించే వేణువు పాట 'మూడ్'ను స్థిర పరుస్తుంది. చారుకేశి రాగం మనసులో మధురమైన విషాద భావాన్ని, అత్యంత పవిత్రమైన భక్తి భావాన్ని రగిలించే రాగం. ఈ సందర్భంలోని పాటకు చారుకేశి రాగాన్ని ఎన్నుకోవటంతోనే సంగీత దర్శకుడు సగం విజయం సాధించినట్టయింది. ఎందుకంటే, సందర్భం గంభీరమైనది, విషాదమయినది. భక్తి భావ రంజితమయిన గానంతో విషాదాన్ని కలిగించిన అపోహను తొలగించటం పాట ఉద్దేశ్యం. అందుకు అత్యంత సమర్ధవంతమైన రాగం చారుకేశి. విషాదాన్ని, భక్తి భావాన్ని కలిగిస్తూ అత్యంత ఆనంద భావనను రగిలించగల రాగం ఇది. ఆరంభంలో వినిపించే వేణునాదంతో పోటీ పడుతూ ఆర్తీ ముఖర్జీ స్వరం అత్యంత మధురంగా పాట అలాపిస్తుంది. తెరపై ఒంటరిగా, విషాదంతో కూర్చున్న నాయిక కనిపిస్తూంటుంది.

కృష్ణుడా, నీ మురళి రాధ పేరు పిలుస్తోంది. కానీ ప్రజలు చెడ్డపేరు మీరాకు ఆపాదిస్తున్నారు. ఆమెను అవమానిస్తున్నారు అంటూ ఆరంభమవుతుంది పాట. పాట ఆరంభంలోనే సర్వం చెప్పేసింది అమ్మాయి. కృష్ణుడు పిలిచేది రాధను. కానీ అందరూ అనుమానిస్తున్నది మీరాను. జరిగింది కూడా ఇదే. విషం తాగాల్సి వచ్చింది మీరాకే.

**సావరేకీ బన్సీ కో బబజ్‌నే సే కాం**

**రాధా కా భీ శ్యాం, హో తో, మీరా కా భీ శ్యాం**

నాయకుడు సమస్యను తేల్చేస్తున్నాడు. కృష్ణుడు మురళికి నాదంతోపని. మధురమైన నాద సృజనతో పని. అతడు రాధకూ చెందినవాడే. మీరాకు చెందిన వాడే. ఇది వినగానే మిస్సమ్మలో పాట గుర్తుకు వస్తుంది.

**బృందావనమది అందరిదీ, గోవిందుడు అందరి వాడేలే**

**ఎందుకె రాధ ఈ శునసూయలు, అందములందరి ఆనందములే.**

సందర్భం కూడా దాదాపుగా ఇలాంటిదే. తెలుగులో ఈ పాటను 'భక్తిగీతం'గా పరిగణించరుకానీ, హిందీ 'మిస్సమ్మ'లో ఇదే భావంతో, ఇదే రాగంతో ఉన్న పాటను వారు భక్తిగీతంగా పరిగణిస్తారు.

**బృందావన్ కా కృష్ణ్ కన్నయ్యా సబ్ కీ ఆఖోంక్ ఆతారా**

**మన్ హీ మన్ క్యూ జలే రాధికా, మోహన్‌తో హై సబ్ కా ప్యారా..**

బృందావనంలోని కృష్ణుడు అందరికీ ప్రీతిపాత్రుడు. రాధ ఎందుకని అసూయ చెందుతోంది, కృష్ణుడు అందరికీ ప్రీతి పాత్రుడు. రాధ ఎందుకని అసూయ చెందుతోంది, కృష్ణుడు అందరికి ఇష్టుడు. రాజేంద్ర క్రిషన్ హిందీలో ఈ పాటకు తన పదాలతో ఒకరకమైన పవిత్రతను ఆపాదించాడు. లత, రఫీలు తమ స్వరాలతో పాటను సింగారించి, పాటలో ఓ వైపు చిలిపితనాన్ని, శృంగారాన్ని చిలికిస్తూనే భక్తిభావాన్ని ధ్వనింపచేశారు. అందుకని తెలుగులో లానే హిందీలోనూ 'సూపర్ హిట్' అయిన ఈ పాట, హిందీలో భజనగీతంలా గుర్తింపు పొందింది.

**జమునా తట్ పర్ నంనంద్ క  లాలా**

**జబ్ జబ్ రాస్ రచాయే రే**

**తన్ మన్ డోలే కాన్‌హా ఐసీ**

**బన్సీ మధుర్ బజాయే  రే**

**సుధ్ – బుధ్ భూలీ ఖడీ గోపియా న జానే  కైసా జాదూడారా॥**

యమునా తీరంలో శ్రీకృష్ణుడు ఎప్పుడెప్పుడు రాసలీల రచించాడో, తనువు, మనసూ ఊగిపోయి, ఆనందంతో విస్మయులై, తన్మయులై, శారీరక స్పృహ కోల్పోయినట్టు గోపికలు నిలబడి పోయే రీతిలో కృష్ణుడి మురళీ నాదం వినిపిస్తుంది.

**రాగములో అనురాగము చిందిన జగమే ఊయల ఊగదటే...**

**రాసపిల్లన గ్రోవిని పిలుపులు వింటే ఉల్లము ఝల్లున పొంగదటే**

**క్రీడల రమణుని గాంచిన ఆశలు మోశులు వేయవటే**

తెలుగులోని రెండు చరణాల భావాలను కలగలిపి, తెలుగు పాటకు భిన్నంగా చరణాన్ని అవసరమైన రీతిలో సాగదీసి హిందీ పాటను రూపొందించారు. గేయ రచయిత అత్యంత చమత్కారంతో తెలుగు పాటకు భిన్నంగా హిందీ పాటను తెలుగు పాటలోని భావాన్ని అనుసరిస్తూనే, స్వతంత్ర గీతంగా మలచాడు. తెలుగులో పాటలో కన్నా అధికంగా 'శృంగార భక్తి' భావాన్ని ధ్వనింపచేస్తూ, భావనల తీవ్రతను పెంచి పాటను సాంద్రతరం చేశారు హిందీలో. తెలుగులో బృందావనంలో రాసక్రీడను వర్ణించటం ఉంది. హిందీలో రెండవ చరణంలో పాటపాడే వారే గోపికలయిపోవటం ఉంది. భక్తి శృంగార భావనను అనుభవించటం ఉంది. దాంతో హిందీ పాట భక్తిగీతం స్థాయికి ఎదిగింది. పైగా ఉత్తరాది వారికి .రాధాకృష్ణుల ప్రేమ తత్వం దక్షిణాది కన్నా అధికంగా ప్రియం.

**రంగ్ సలోనా ఐసా జైసే ఛాయీ హై ఘట్ సావన్ కీ**
**ఏరీ మైతో హుయీ దీవానీ, మన్ మోహన్ మన్ భావన్ కీ**
**తేరే కారన్ దేఖ్ బావరే , ఛోడ్ దియా మైనే జగ్ సారా...**

కృష్ణుడి శరీరం రంగు వర్షపు మేఘాలు ఆకాశంలో కమ్ముకున్నట్టుంది. కృష్ణుడి ప్రేమలో పిచ్చిదాన్నయి పోయాను. నీ కారణం వల్ల (ప్రేమ వల్ల) నేను పిచ్చిదాన్నయి ప్రపంచాన్ని త్యజించాను. ఇది హిందీ పాటలో భావం. 'ఏరీ మైతో హుయీ బావరీ' అనటంతోటే మీరా భజనలు గుర్తుకు వస్తాయి 'ఏరీ మెతో ప్రేం దివానీ' అన్న భజన మనసులో మొదలుతుంది. దాంతో పాట 'మీరా భజన'లా భక్తి భావరంజితమైపోతుంది. పాటలోని శ్లేష, శృంగారం ఆధ్యాత్మక స్థాయికి ఎదుగుతాయి. పాట స్వరూప స్వభావాలు మారిపోతాయి. శ్రోతలు పాటలోని భావంతో స్పందిస్తారు. తన్మయులైపోతారు. ఈ రకంగా తెలుగు పాటను అనుసరిస్తూనే అందుకు భిన్నమైన గుర్తింపును పొందే రీతిలో హిందీ పాటను రూపొందించారు సంగీత దర్శకుడు హేమంత్ కుమార్, రాజేందర్ క్రిషన్‌లు ఇదే భావనలు ప్రదర్శిస్తూ రవీంద్రజైన్ విభిన్నమైన ఫలితం సాధించాడు. తన పాటను సినీ సందర్భంలో ఒదిగించాడు. పాట 'భజన' స్థాయికి ఎదిగించాడు.

**జమునా కీ లహరే బన్సీబట్ కీ ఛై యా**
**కిస్‌కా నహీ హై కహో కృష్ణ కణయా**
**శ్యాం కా దీవానా తో సారా బ్రిజ్ ధాం॥**

యమునానది తరంగాలు, మర్రిచెట్టు నీడ అందరివీ ఎలాగో, కృష్ణుడు కూడా అందరివాడు. మొత్తం బ్రజ భూమి అంతా కృష్ణ మాయలో ఒదిగినదే. ఇక్కడ నాయకుడు కృష్ణుడిలాంటివాడు. అందరివాడు అని అర్థం అని.

కౌన్ జానే బాసురియా కిస్‌కో  బులాయే

జిస్‌కే మన్ భాయే వో ఉసీకే గుణ్ గాయే

కౌన్  నహీ బన్సీ కీ ధున్ కా గులాం॥

శ్రీ కృష్ణుడి మురళి ఎవరిని పిలుస్తోందో, ఎవరికి తెలుసు. ఎవరిని మురిపిస్తుందో అది వారికోసమే పాడుతుంది. అయితే, ఇక్కడ ముందే స్పష్టం చేశారు, కృష్ణుడి మురళి రాధను పిలుస్తోందని. కాబట్టి నాయకుడు ఎంతగా నిర్మోహంగా, తటస్థంగా ఉండాలని ప్రయత్నించినా కుదరదు.

ఇక్కడ ఒక చమత్కారం చేశాడు గేయ రచయిత రవీంద్రజైన్. పాటను పాడిన అమ్మాయి తనను మీరాతో పోల్చుకుని నాయికను రాధతో ఎందుకు పోల్చుకుంది? రాధ, మీరా ఇద్దరూ కృష్ణుడిని ప్రేమించారు. రాధ ప్రేమ ప్రత్యక్షం. రాధను కృష్ణుడు బృందావనంలో కలిశాడు. రాసక్రీడలు జరిపాడు. కానీ మీరా కృష్ణుడిని ప్రత్యక్షంగా కలవలేదు. కృష్ణుడిని ప్రేమించింది. అతడి కోసం ప్రపంచాన్ని వదిలేసింది. కానీ కృష్ణుడికి ఆ విషయం తెలియదు. కృష్ణుడిని ఆమె ప్రత్యక్షంగా కలవలేదు. కృష్ణుడు కూడా ఆమెపై ప్రేమ వ్యక్తం చేయలేదు. అంటే మీరాది ఏకపక్ష ప్రేమ అన్నమాట. ఈ విషయాన్ని తెలిపి 'వాడు నీవాడే' అంటోంది ఆ అమ్మాయి. అయితే, రాధ, మీరాల ప్రేమలో తేడాని అత్యద్భుతమైన గీతంలా మంచి, ఒక మాములు సందర్భంలోని పాటను ఆధ్యాత్మిక గీతం స్థాయికి ఎదిగేట్టు చేశాడు రవీంద్ర జైన్ 'రాం తెరీ గంగా మైలీ' సినిమాలో. ఆ సినిమాలో ఇతర పాటల జోరులో, మందాకినీ జలపాత ధారల స్నానాలలో అందరి దృష్టీ ఆవైపు మళ్లటంతో ఆ సినిమాలోని పరమాద్భుతమైన ఈ పాట అంతగా అందరి దృష్టినీ ఆకర్షించలేదు.

ఎక్ రాధా, ఎక్ మీరా, దోనోంనే శ్యాం కొ చాహా

అంతర్ క్యా దోనోకి చాహమే బోలో

ఎక్ ప్రేం దీవానీ, ఎక్ దరస్ దీవానీ.

'రాం తెరీ గంగా మైలి' కథ మాములు అలవాటయిన కథ. ఓ అబ్బాయి పర్వత ప్రాంతాలకు వెళ్తాడు. ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని మళ్లీ వస్తానని చెప్పి తన ఊరు వచ్చేస్తాడు. అక్కడ ఇంట్లో వాళ్లు బలవంతాన అతడికి వేరే పెళ్లి చేసేందుకు సిద్ధమౌతారు. ఈలోగా గర్భవతి అయిన ఆ అమ్మాయి అతడిని వెతుకుతూ వస్తుంది. జీవిక కోసం నృత్యాలు చేస్తుంది. చివరికి తన ప్రియుడి పెళ్లిలో నృత్యం చేయటానికి వస్తుంది. ప్రియుడిని చూస్తుంది. ఎవరిని వెతుకుతూ వచ్చిందో, అతడు పరాయివాడయిపోవటాన్ని చూస్తూ నృత్యం చేయాల్సిన సందర్భం అది. ఇలాంటి సందర్భంలో 'పాకీజా' సినిమాలో 'ఆజ్ హం అప్ నీ దువావోంకా అసర్ దేఖేంగే ' అనే అద్భుతమైన పాట వస్తుంది. ఇలాంటి సందర్భంలో హీరో హీరోయిన్లు పలు అద్భుతమైన పాటలు పాడారు 'గజల్' సినిమాలో హీరో 'రంగ్ ఔర్ నూర్

కీ బారాత్ కిసే పేష్ కరూ' అంటూ పాడాడు. 'దిల్ అప్ నా ఔర్ ప్రీత్ పరాయా'లో లతా మంగేష్కర్ 'అజీబ్ దాస్తాన్ హైయే ' అంటూ పాడింది. 'ఖిలోనా' సినిమాలో రఫీ 'ఖుష్ రహే తూ సదా, యె దువా హై మెరీ' అంటూ పాడాడు. కానీ ఇలాంటి పాట మాత్రం ఎవ్వరూ పాడలేదు.నాయికకు తెలుసు. నాయకుడిని పెళ్లి చేసుకోబోతున్న అమ్మాయి కూడా నాయకుడిని ప్రేమించిందని. మళ్లీ ఇక్కడ రాధ, మీరాలతో పోలిక వస్తుంది. అయితే పాటలో అడుగుతోంది. రాధ, మీర ఇద్దరూ కృష్ణుడిని ప్రేమించారు. వారిద్దరి ప్రేమలో భేదం ఏమిటి? అని. రాధ ప్రేమలో పిచ్చిదయింది. మీర కృష్ణుడి దర్శనం కోసం తపనలో పిచ్చిదయింది.ఒక హృద్యమైన సందర్భానికి అత్యద్భుతమైన గేయం కుదిరింది.

**రాధానే మధు బన్ మే ఢూండా, మీరా నే మన్ మే పాయా,**
**రాధా ఖోబైఠీ వో గోవింద్, మీరా హాథ్ బిక్ ఆయా**
**ఏక్ మురళీ, ఏక్ పాయల్, ఏఖ్ పగ్‌లీ, ఏక్ ఘాయల్**
**అంతర్ క్యా దోనోకీ ప్రీతమె బోలో**
**ఎక్ సూరత్ లుభానీ, ఎక్ మూరత్ లుభానీ**
**ఎక్ ప్రేం దివానీ, ఎక్ దరస్ దివానీ**

పరమాద్భుతం. రాధ, మీరాల ప్రేమను ఇంత లోతుగా, పరిశీలించి, ఇంత సూక్ష్మంగా విశ్లేషించి ప్రదర్శించిన గీతాలు లేవు. ఇదంతా ఆధ్యాత్మిక పుస్తకాలు, కీర్తనలలో ఉంటుంది. సినిమా పాటలలో కాదు. కానీ సినిమా పాటలో ప్రదర్శించి, సందర్భంలో ఒదిగింప చేసి ప్రజలకు సంస్కారవంతమైన భావనలు కలిగించే రీతిలో పాటను రూపొందించాడు గేయ రచయిత, సంగీత దర్శకుడు రవీంద్రజైన్. రాధ కృష్ణుడిని బృందావనంలో వెతికింది. మీరా కృష్ణుడిని తన మనస్సులోనే పొందింది. రాధ ఎవరినైతే పోగొట్టుకుందో, కోల్పోయిందో, ఆ కృష్ణుడిని మీరా తన ప్రేమతో గెలుచుకుంది. ఒకరు మురళి, ఒకరు పాదాల గజ్జెలు, ఒకరు పిచ్చివారు, మరొకరు గాయపడినవారు. ఒకరు శ్రీ కృష్ణుడి వదనం చూసి సర్వం మరచిపోతే, మరొకరు శ్రీకృష్ణుని విగ్రహానికి సర్వం అర్పించారు. ఒకరు రాధ, ఒకరు మీరా. ఇద్దరి ప్రేమలో తేడా ఇది. సినిమాలో నాయిక నాయకుడిని పెళ్ళిచేసుకుంటుంది,కానీ అతడికి దూరమయింది. అతడు ఇప్పుడింకో ఆమెని పెళ్ళిచేసుకుంటున్నాడు. రాధ కోల్పోవటము, మీరా పొందటము వెనుక పోలిక ఇది. సినిమా సందర్భానికి సరిపోతుంది. పాత్రల స్థితిని మరింత హృద్యం చేస్తోంది.

**మీరాకే ప్రభు గిరిధర్ నాగర్, రాధాకే మన్మోహన్**
**రాధానిత్ శృంగార్ కరే, మీరా బన్ గయీ జోగ న్**
**ఎక్ రాణీ, ఎక్ దాసీ, దోనో హరి ప్రేం కి ప్యాసీ**
**అంతర్ క్యా దోనోకి తృప్తి మే బోలో**

## ఎక్ జీత్ న మానీ, ఎక్ హార్ న మానీ

అలౌకికానందం! మనస్సులోనే స్వర్గద్వారాలు తెరిపించి బ్రహ్మానందం లాంటి ఆనందం కలిగిస్తుందీ పాట సాహిత్యం, భావం, లతాగానం, సంగీతం.

మీరా ప్రభువు గిరిధారి. రాధ ప్రభువు మన్మోహనుడు. రాధ ప్రతి రోజూ శృంగారం చేసుకుని బృందావనంలో శ్రీకృష్ణుడి కోసం ఎదురు చూస్తూంటూంది. మీరా కృష్ణుడి ప్రేమలో సర్వం త్యజించి సన్యాసిని అయింది. ఒకామె రాణి. మరొకామె దాసి. కానీ వారిద్దరూ హరిప్రేమ పిపాసులు. వారిద్దరి తృప్తిలో తేడా ఏమిటంటే, ఒకరు గెలుపును ఒప్పుకోలేదు, మరొకరు ఓటమిని ఆమోదించలేదు. ఒకరు రాధ. ఒకరు మీర. ఎలాంటి పాటలివి? ఎలాంటి కళాకారులు వారు? ఇంత అత్యద్భుతమైన పాట ఉన్న సినిమాలో నాయిక శారీరక ప్రదర్శన ప్రధాన ఆకర్షణ. అయిందంటే ఆ సమాజం స్థాయి ఊహించుకోవచ్చు. అయితే, అలాంటి సినిమాలోనే ఇలాంటి పాట ఉండటం చీకటినంటే ఉండే వెలుగులాంటిదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అన్నిరకాల మనుషులు, అన్ని రకాల మనస్తత్వాలు. దాన్లోంచి క్షీర నీర న్యాయం పాటించి ఉత్తమత్వానికి ఔన్నత్యానికి పెద్దపీట వేయటం వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిరూపిస్తుంది.

.రవీంద్రజైన్ ఈ పాటను కీరవాణి రాగంలో రూపొందించాడు. ఈ పాటలో ప్రత్యేకంగా గమనించాల్సింది లతామంగేష్కర్ పాటను పాడినవిధానం. లత తప్ప ఎవరు పాడినా పాటలో 'లోతు', 'గాంభీర్యం ' 'పవిత్రతలు' లోపించేవి. ఆ సమయంలో లతకి 60 ఏళ్లుంటాయి. కానీ, ఆమె స్వరం 'మందాకిని' పాత్రకు చక్కగా అమరుతుంది. ఒక రకంగా చెప్పాలంటే లత స్వరం వల్ల మందాకిని గౌరవించదగ్గదిగా కనిపిస్తుంది. ఎక్ రాధ అంటూ రాగం తీయటంతోటే మనసు పురివిప్పిన నెమలి అవుతుంది. 'దోనో' అని మొదటిసారి 'లత' అన్న విధానం పాటను ప్రేమ వేదన లోతులకు, ఆధ్యాత్మిక భావన ఎత్తులకు తీసుకు వెళ్తుంది. ఇతరు ఎవరయినా 'దోనో' మాములుగా అనేవారు. 'లత' 'దోనో' దగ్గర ముర్కిలు వేసి రాధ, మీర ఇద్దరూ ఒకరికొకరు తీసిపోరని, ప్రేమ లోతుల్లో, ఎత్తుల్లో వారికి వారే సాటి అన్న భావనను కలిగిస్తుంది. ప్రతి ఒక్క పదాన్ని లత పలికిన తీరు, తాను అనుభవిస్తూ భావాన్ని పాటలోని పదాలకు అద్దిన తీరు అమోఘం. ఇలాంటి పాటలు విన్నప్పుడే మనపై సంగీత సాహిత్యాల అమృత క్షీరధారలు వర్షింపచేసి, ఆనంద పరవశులను చేసి, మనలోని దైవత్వ భావనను క్షణకాలమైనా జ్ఞప్తికి తెచ్చేందుకు భువిపైకి వచ్చిన సరస్వతీదేవి వీణాస్వరం లత స్వరం అనిపిస్తుంది.

ఇలాంటి సందర్భమే 'మై తులసీ తేరె ఆంగన్ కీ' సినిమాలో వస్తుంది. తన భర్తతో సంబంధం ఆశాపరేఖ్‌కు ఉన్నదని 'నూతన్' పాత్ర భావిస్తుంది. ఆ అనుమానాన్ని, అపోహను దూరం చేస్తూ ఆశాపరేఖ్, లత అమృతమయ స్వరంలో 'మై తులసీ తేరె అంగన్ కీ' అన్న పాట పాడుతుంది. పాట బాణీ, లత స్వరం అద్భుతంగా ఉండి పాట స్థాయిని పెంచుతాయి.

ఇటువంటి పాటలు విన్న తరువాత 'దిగిరాను దిగిరాను దివినుంచి భువికి' అని ఎలుగెత్తి అరుస్తూ, ఈ పాటలే వింటూ అలౌకికానందాన్ని అనుభవిస్తూ, అక్కడే అత్యత్తుమ భావాలు, రాగాలు నిత్యం వినిపించే ఆకాశంలోనే ఉండిపోవాలనిపిస్తుంది. మామూలు పాటలు వినాలని పించదు.

*(వచ్చే నెల మరిన్ని భక్తి, ఆధ్యాత్మిక తాత్విక పాటలతో.. )*

Post your comments